ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యం

- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- వారాంతపు పరీక్షలు తప్పనిసరి
- డీఈవో మారెడ్డి అనురాధ



హాజరైన ఎంఈవోలు, హెచ్ఎంలు

కడప(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13: ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన సాగించాలని జిల్లా విద్యాశాఖాధికారి మారెడ్డి అనురాధ అన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. వారాంతపు పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. మంగళవారం కడప నగరం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో పదో తరగతి పరీక్షలపై ఎంఈవో పాలెం నారాయణ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వత్తిడి లేని విద్యావిధానం కొనసాగించాలని సూచించారు. విద్యార్థులకు మంచి చెడు ఉపాధ్యాయులు నేర్పించాలన్నారు. ధైర్యం, సాహసంతో ముందుకు పోయే విధంగా వారిలో ఉత్సాహం నింపాలని తెలిపారు. చిన్నతనం నుండే కమ్యూనికేషన్ స్కిల్స్, సెమినార్స్ వంటివి నేర్పించాలన్నారు. యాక్షన్ ప్లాన్ ప్రకారంగా పాఠాలు బోధించాలన్నారు. అలాగే బీ, సీ, డీ విద్యార్థులకు ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అనంతరం స్టేట్ నోడల్ ఆఫీసరు చిట్టిబాబు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఈవోలు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు



మాట్లాడుతున్న డీఈవో అనురాధ

కల్పవృక్ష వాహనంపై దేవదేవుడు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 13: దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో సాగుతున్న ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు విశేషంగా హాజరై స్వామివారి సేవలో పాల్గొంటున్నారు. అందులో భాగంగా నాల్గవ రోజైన మంగళవారం ఉదయం దేవదేవుడు కల్పవృక్షవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తదనంతరం స్నపన తిరుమంజనం గావించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. పిదప టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే చేపట్టిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి 8గంటలకు శ్రీనివాసుడు ప్రత్యేక అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా హనుమంత వాహనంలో ఊరేగి భక్తులకు అభయాన్నందించారు. స్వామివారి గ్రామోత్సవానికి ముందుగా కోలాటం, చెక్కభజన కళాకారుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.




కల్పవృక్ష వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరుడు

పార్టీ మారతారా..

అయితే మా లెక్క ఇచ్చెయ్యండి

- వైసీపీ మార్కు బెదిరింపు
- ఓ వైపు కేడరు పార్టీ మారకుండా ఉండేందుకు డబ్బులు పంపిణీ
- మరో వైపు పార్టీ మారిన వారు డబ్బు వెనక్కి ఇవ్వాలని హుకుం
- వైసీపీ ప్రభుత్వ పాలనే కాదు.. నేతలూ రివర్స్


శ్రీశ్రీశ్రీ అంకాలమ్మ తల్లి
గుడి నిర్మాణంకొరకు చందా రశీదు
కొత్తపుల్లూరు గ్రామం, ఖాజీపేట మం॥, కడప జిల్లా.
నెం. 201 తేదీ :
పేరు:
అడ్రస్:
రూ॥ అక్షరాల
మాకు ముట్టినది.
రూ॥ 100000
ఇచ్చినవారి సంతకం

ఖాజీపేట మండలం పుల్లూరు ఎస్సీ, ఎస్టీ కాలనీలో అంకాళమ్మ గుడి నిర్మాణానికి వైసీపీ నేత నాగేశ్వర్‌రెడ్డి రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్టు ఉన్న రశీదు. అయితే తాను ఇచ్చింది గుడికి విరాళం కాదు, పార్టీకోసం అంటూ ఆ డబ్బును పార్టీ మారిన వారి నుంచి వసూలు చేశారు.

(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సొంత జిల్లాలో టీడీపీ రోజురోజుకూ బలోపేతం అవుతుండడంతో వైసీపీకి మైండ్ బ్లాక్ అవుతున్నట్లుంది. జిల్లా వ్యాప్తంగా ఏదోచోట ప్రతి రోజూ వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు ఉంటున్నాయి. తొలుత ఈ చేరికలను వైసీపీ లైట్ తీసుకుంది. జనమే కాదు కేడరు కూడా అసంతృప్తిలో ఉందని గుర్తించి వెంటనే ఆ పార్టీ మార్కు తాయిలాలకు తెరలేపింది. అందులో భాగంగా పులివెందుల, జమ్మలమడుగులో సొంత కేడరు సైకిలెక్కకుండా ఉండేందుకు గాను నేతల స్థాయిని బట్టి రూ.3 లక్షల నుంచి రూ.30 లక్షలు ముట్టజెప్పారని ప్రచారం జరుగుతోంది. ఓ పక్క కేడరును బుజ్జగించేందుకు తాయిలాలతో ప్రలోభపెడుతుంటే మరో పక్క వైసీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన వారిపై బెదిరింపులకు పాల్పడుతుండడం తీవ్ర దుమారం రేపుతోంది. ఆఖరుకు గుడికి ఇచ్చిన విరాళం సొమ్మును కూడా వెనక్కి తీసుకోవడం వైసీపీలోని అభద్రతకు తార్కాణంగా నిలుస్తోంది.

ఖాజీపేట మండలం పుల్లూరు ఎస్సీ ఎస్టీ కాలనీకి చెందిన కొందరు వైసీపీ నేతలు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. అయితే కొన్ని నెలల క్రితం గ్రామంలో గుడి నిర్మాణం చేపట్టగా అనుకున్న వ్యయం కన్నా ఎక్కువ కావడంతో స్థానిక వైసీపీ నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఇప్పుడు ఆ గ్రామస్థులు పార్టీ మారడంతో నాగేశ్వర్ రెడ్డి తాను ఇచ్చిన లక్ష రూపాయలను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడం హాట్‌టాపిక్‌గా మారింది. మీరు పార్టీ మారారు కాబట్టి డబ్బులు వెనక్కి ఇవ్వండి అంటూ హుకుం జారీ చేశాడు. చివరికి డబ్బులు లేకపోవడంతో ట్రాక్టరును తాకట్టు పెట్టి డబ్బులు చెల్లించిన తరువాత దానిని తీసుకెళ్లారు. ఇది ఇప్పుడు జిల్లాలో బాగా చర్చనీయాంశంగా మారింది.

వైసీపీ ప్రభుత్వ పాలన అంతా రివర్స్ అంటూ టీడీపీ తీవ్ర విమర్శలు చేస్తోంది. అందుకు తగ్గట్టుగానే గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీసీ పాలనలో అన్నీ వింత సంఘటనలు జరుగుతూ వస్తున్నాయి. సాధారణంగా ఎన్నికల సమయంలో గుడి, బడి, మసీదు, చర్చి నిర్మాణాలకు సహజంగా పేరున్న పార్టీ నాయకులు విరాళాలు ఇస్తూ వస్తుంటారు. కొందరు స్థాయిని బట్టి నేతలే కాదు సామాన్యులు సైతం బడులైతే, గుడులైతేనేమి వారి ఆర్థిక పరిస్థితిని బట్టి విరాళాలు ఇస్తూ ఉదారత చాటుకుంటారు. కొందరైతే కుడి చేత్తో ఇచ్చిన సాయాన్ని ఎడమ చేతికి తెలియకూడదనే చందంగా విరాళాలు ఇచ్చినా బయటికి చెప్పరు. అయితే ఇప్పుడు పార్టీ మారారని విరాళంగా ఇచ్చిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని వత్తిడి తెచ్చి ట్రాక్టరును కుదువ పెట్టుకునేంత వరకు వైసీపీ నేతలు వ్యవహరించడం తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



అంతా రివర్సే

సీఎం అయినా, ప్రజా ప్రతినిధి అయినా, నాయకుడైనా ప్రజల అభిమానాన్ని చూరగొనేలా పాలన చేస్తే.. ప్రజలూ వారి వెన్నంటే ఉంటారు. వైసీపీ ప్రభుత్వం కొలువుదీరడానికి ముందు ఇలానే ఉండేది. అయితే జగన్ సీఎం అయిన తరువాత అంతా రివర్స్‌లో జరుగుతోందనే విమర్శ ఉంది. నచ్చని వారిని ఇబ్బందులకు గురిచేయడం, వారి ఆర్థిక మూలాలను దెబ్బతీయడం చేస్తున్నారనే విమర్శ ఉంది. ఇక ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడినా, పోస్టులు పెట్టినా జైలుకు పంపుతున్నారు. వలంటీర్ల సైన్యాన్ని పెట్టుకుని జనంపై నిఘా పెట్టారనే విమర్శ ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గతంలో ఎప్పుడూ లేనట్లు, సంక్షేమం అంటే జగన్‌తోనే ప్రారంభం అయినట్లు కటింగ్ ఇస్తూ.. ఆ సొమ్ము కూడా వీరి జేబుల్లో నుంచి ఇస్తున్నట్లు ఫోజులు కొడుతూ పథకాలు తీసుకున్న పాపానికి జనం అణిగి మణిగి ఉండాలనే విధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శ ఉంది. గ్రామాల్లో అయితే వైసీపీ నాయకుడు, పట్టణాల్లో అయితే కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఇతర వైసీపీ ముఖ్య నేతలు నియంతల్లా మారారు. తాము ఏర్పాటు చేసే సమావేశాలకు పథకాల ద్వారా లబ్ధి పొందినవారు రాకపోతే పథకాలు కట్ చేస్తామని వలంటీర్ల ద్వారా బెదిరిస్తున్నారనే విమర్శ ఉంది. గడప గడపకు మన ప్రభుత్వం, సామాజిక న్యాయం బస్సుయాత్ర, ఆసరా పథకం ఇలా ఒకటేంటి సొంత పబ్లిసిటీకి సొంత భజన చేసుకునే కార్యక్రమాలకు బలవంతంగా జనాలను తరలించారని చెబుతారు. పార్టీ మారితే మేం ఇచ్చిన లెక్క ఇవ్వాలని ఎలా బెదిరించారో.. సభలకు రాకపోతే సంక్షేమ పథకాలు కట్ అంటూ బెదిరించడం గమనార్హం. డ్వాక్రా వారి పరిస్థితి మరీ ఘోరం. చంద్రబాబు హయాంలో డ్వాక్రా సంఘాలు పురుడు పోసుకున్నాయి ఆ తరువాత ప్రభుత్వాల్లోనూ కొనసాగుతూ వచ్చాయి. సీఎంల పర్యటనలు, ఇతరత్రాలకు డ్వాక్రా మహిళలను తరలించడం సహజంగా జరిగేదే. అయితే జగన్ పాలనలో మాత్రం వారిని ఇష్టారాజ్యంగా సభలు సమావేశాలకు టార్గెట్ పెట్టి మీటింగ్‌లకు తీసుకుపోవడం విమర్శలకు తావిస్తోంది. ఏదేమైనా.. తాము చెప్పింది వినాల్సిందే.. తామేం చేసినా యస్ అనాల్సిందే అనే రీతిలో వైసీపీ వారి తీరు ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విరాళం వెనక్కు తీసుకోవడం సిగ్గుచేటు

- రాజకీయాలు చేసుకోండి... కార్యకర్తల జోలికి వస్తే ఒప్పుకోం
- మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్

ఖాజీపేట, ఫిబ్రవరి 13: గుడికి ఇచ్చిన విరాళం వెనక్కు తీసుకోవడం సిగ్గుచేటని, మీ ఇష్టానుసారంగా రాజకీయాలు చేసుకోండి.. కానీ కార్యకర్తల జోలికొస్తే మాత్రం ఒప్పుకోం అని టీడీపీ మైదుకూరు ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ వైసీపీ వారిని హెచ్చరించారు. మంగళవారం పుల్లూరు ఎస్సీ, ఎస్టీ కాలనీలోని శివ ఇంటికి వెళ్లి జరిగిన సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు, బడులు కట్టించేందుకు విరాళం ఇస్తారు కానీ వైసీపీ హయాంలో అంతా రివర్స్ జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చేసిన రివర్స్ పనుల వల్ల కార్యకర్తలు కూడా అలాంటి అరాచకాలకే పాల్పడుతున్నారన్నారు. పశువులు చేనులో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్న చందంగా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. వైసీపీ అరాచకాలు చూడలేక టీడీపీలో చేరితే ఇచ్చిన విరాళాలు వెనక్కు తీసుకోవడం సిగ్గుమాలిన పని అన్నారు. తనవల్ల కార్యకర్త అప్పు చేసుకోకూడదని శివకు రూ.లక్ష ఇస్తున్నా అన్నారు. పది మందిని అడిగి అంకాళమ్మ గుడి ఏర్పాటు చేస్తే అలాంటి వ్యక్తిని అభినందించాల్సింది పోయి ఎస్సీ వ్యక్తి కావడంతో బెదిరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, నాయకులు వెంకటసుబ్బయ్య, ఫరూక్, సుబ్బయ్య, నరసింహులు, సిద్దారం కదిరుల్లా, కొత్తపేట బుజ్జి, శివ, ప్రతాప్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, పిచ్చినాయుడు, బాబ్జి తదితరులు ఉన్నారు.



కార్యకర్తకు లక్ష నగదును అందజేస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

యువకుడి హత్య



రోదిస్తున్న మృతుడి అక్క లక్ష్మీదేవి



మృతదేహాన్ని చూడడానికి వచ్చిన బంధువులు, మిత్రులు

- దారికాచి రాళ్లతో కొట్టి చంపి..
- ట్రాక్టర్‌లో తీసుకెళ్లి భూమిలో పాతిపెట్టిన దాయాదులు
- పాతకక్షలతో ఘాతుకం



రామ్మోహన్‌రెడ్డి (ఫైల్)

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 13: బ్రహ్మంగారిమఠం మండలంలో దారుణం చోటుచేసుకుంది. పాతకక్షలతో ఓ యువకుడిని దాయాదులు దారికాచి అటకాయించి రాళ్లతో కొట్టి హత్య చేశారు. ఆపై ట్రాక్టరులో వేసుకుని వేరే ప్రాంతానికి తీసుకెళ్లి మృతదేహాన్ని భూమిలో పూడ్చిపెట్టారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి రావడంతో జిల్లాలో కలకలం రేపింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు..

బ్రహ్మంగారిమఠం మండలం దిగువనేలటూరు పంచాయతీ మలుగుడుపాడు గ్రామానికి చెందిన రైతు దంపతులు మార్తమ్మ, పిచ్చిరెడ్డిలకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు కుంచాల రామ్మోహన్‌రెడ్డి (26) ఎమ్మెస్సీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఇంటి దగ్గరే ఉంటూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో రామ్మోహన్‌రెడ్డి ఈనెల 9వ తేదీ శుక్రవారం సాయంత్రం బద్వేలుకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని తండ్రి పిచ్చిరెడ్డి బి.మఠం పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ విద్యాసాగర్ బద్వేలు టౌన్‌లో సీసీ కెమెరాలు పరిశీలించి కొంత మంది అనుమానితులను విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

దారి కాచి హత్య

శుక్రవారం రాత్రి బద్వేలు నుంచి రామ్మోహన్‌రెడ్డి ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో బూదవాడ గ్రామం వద్ద అతడిని దాయాదులు కుంచాల గుర్విరెడ్డి, వెంకటరెడ్డితో పాటు బద్వేలు పట్టణానికి చెందిన ఖాదర్‌వలి, మేరుగ తరుణ్, అదే గ్రామానికి చెందిన తమ్మిశెట్టి సుబ్బరాయుడు, గంపా రామలక్షుమయ్య కలిసి అడ్డగించి రాళ్లతో తలపై కొట్టారు. దీంతో రామ్మోహన్‌రెడ్డి అక్కడే మరణించాడు. మృతిచెందిన అతడిని ట్రాక్టరులో వేసుకుని బి.కోడూరు మండలంలోని వంకమర్రి గ్రామ సమీపంలో వెంకటరెడ్డి బొగ్గులబట్టీ వద్దకు తీసుకెళ్లి దానికి సమీపంలో పాతిపెట్టారు. పోలీసుల విచారణలో ఈ విషయం బయటపడ్డంతో మంగళవారం మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథరెడ్డి, బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వైద్యులు, తహశీల్దారు పర్యవేక్షణలో బయటికి తీసి, పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పజెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బి.మఠం ఎస్ఐ తెలిపారు.

చిన్న తగాదాతో..

2022వ సంవత్సరంలో ఇటుకబట్టీలు కాల్చుకునే సమయంలో కుంచాల రామ్మోహన్‌రెడ్డికి దాయాదులైన గుర్విరెడ్డి, వెంకటరెడ్డిలకు చిన్న తగాదా జరిగింది. దీనిపై అప్పట్లో కుంచాల వెంకటరెడ్డిపై కేసు పెట్టారు. అప్పటి నుంచి వారు రామ్మోహన్‌రెడ్డిపై కక్షపూరితంగా ఉండేవారని మృతుడి తల్లిదండ్రులు పేర్కొన్నారు. అయితే ఇంత దారుణానికి పాల్పడతారని అనుకోలేదని వారు తెలిపారు. చేతికందిన కొడుకు హత్యకు గురికావడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మలుగుడుపాడు గ్రామంలో అందరితో కలిసి మెలిసి ఉండేవారమని, చీమకు కూడా అన్యాయం చేయలేదని రోదిస్తూ చెప్పారు. కానీ మా కుమారుడిని అతి కిరాతకంగా చంపడం బాధ కలిగిస్తోందన్నారు.

ఉద్యోగంలో స్థిరపడతాడనుకున్నాం..

మా తమ్ముడు ఎమ్మెస్సీ పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం ఇటీవల హైదరాబాదుకు వెళ్లి వచ్చాడని, ఉద్యోగంలో స్థిరపడతాడనుకున్నామని, ఇంతలోనే ఇలా జరిగిందని మృతుడి సోదరి లక్ష్మీదేవి సంఘటనాస్థలం వద్ద భోరున విలపించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. సంఘటన స్థలం వద్దకు మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ చేరుకుని మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు ఫోన్ చేసి రామ్మోహన్‌రెడ్డి చిన్న వయసులోనే హత్యకు గురవడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు.



పంచనామా నిర్వహిస్తున్న వైద్యులు, పోలీసులు

రియల్టర్లకు అధికారుల దాసోహం



చెన్నముక్కపల్లె పైభాగాన మట్టిని తరలించడంతో ఏర్పడిన గుంతలు



ప్లాట్లలో మట్టిని చదును చేస్తున్న యంత్రం

- ప్రభుత్వ బంజరు భూమి నుంచి భారీగా మట్టి తరలింపు

ఖాజీపేట, ఫిబ్రవరి 13: ఒక ట్రాక్టర్ మట్టి తోలుకోవాలంటే లక్ష సాకులు చెప్పే అధికారులు టిప్పర్లు, ట్రాక్టర్లతో యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నా రియల్టర్లను అడ్డుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారులకు తెలిసినా అటువైపు తొంగిచూడటం లేదు. దీనివెనక అధికార పార్టీ నేతల హస్తం ఉండటంతో అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఖాజీపేట మండలం కొత్తనెల్లూరు సమీపంలోని ఖాజీపేట బైపాస్‌లో ప్లాట్లు వేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ ప్లాట్లను చదును చేసేందుకు చెన్నముక్కపల్లె పైభాగం నుంచి అక్రమంగా మట్టిని ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రైతుల పంట పొలాల్లోకి దుమ్ము వస్తుందని అభ్యంతరం తెలపడంతో రాత్రివేళల్లో తరలిస్తున్నారు. అదే పంచాయతీకి చెందిన వ్యక్తి రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తూ మట్టిని తోలుతున్నారు. ఎవరైనా అభ్యంతరం చెబితే తాము అధికార పార్టీ వాళ్లమంటూ బెదిరిస్తున్నారని సమాచారం. రియల్టర్లు తమ వెంచర్లకు మట్టి తోలుకోవడమే కాకుండా వేరే వాళ్లకు కూడా ట్రాక్టరు మట్టి రూ.1000 చొప్పున అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు. దీనిపై ఖాజీపేట తహశీల్దారు వెంకటలక్ష్మిని వివరణ కోరగా.. అధికారికంగా మట్టి తోలేందుకు ఎవరికీ అనుమతి లేదని అన్నారు. తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని, పోలీసులకు సమాచారం ఇచ్చి మట్టి తరలింపును అడ్డుకుంటానని అన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్ప

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 13: జగన్ పాలనలో రాష్ట్ర అప్పుల కుప్ప అయ్యిందని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ అప్పులు ఫుల్.. అభివృద్ధి నిల్, సంక్షోభంలో సంక్షేమం అని మూడు మాటల్లో జగన్ పాలనను చెప్పవచ్చున్నారు. 2019 నుంచి నేటి వరకు జగన్ ప్రభుత్వం చేసిన అదనపు అప్పు ఎనిమిదిన్నర లక్షల కోట్ల రూపాయలు అని తెలిపారు. జగన్ పాలనలో అభివృద్ధి అంకె వేసిందన్నారు. నిధుల కొరతతో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదు.. నిర్వహణకు కూడా నిధులు లేవు... పర్యవసానంగా అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందన్నారు. రాష్ట్రంలో రహదారులు మృత్యుకు హరాలయ్యాయన్నారు. ఇచ్చేది గోరంత అయితే లాక్కునేది కొండంత అని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలతో పాటు కరెంటు, ఆర్టీసీ చార్జీలు విపరీతంగా పెరిగాయని తెలిపారు.

గాలిలో దీపంలా లష్కర్లు

- 2020లో విధుల్లోకి 120 మంది
- మంచి భవిష్యత్తు అంటూ ఆశపడ్డ నిరుద్యోగులు
- డిసెంబరుతో కాంట్రాక్ట్ ముగిసిందంటున్న అధికారులు
- దిక్కుతోచని స్థితిలో లష్కర్లు



సీబీఆర్ కాల్వ వద్ద పనులు చేస్తున్న లష్కర్లు (ఫైల్)

లింగాల, ఫిబ్రవరి 13: పులివెందుల నియోజకవర్గంలోని పైడిపాళెం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నుంచి పంప్‌హౌస్‌ల ద్వారా గ్రామాల్లోని వంకలు, వాగులు, చెరువులకు నీటిని నింపే ప్రక్రియ విజయవంతంగా కొనసాగేందుకు లష్కర్ల నియామకం చేపట్టారు. ప్రధాన రిజయర్వాల్ల వద్ద గేట్లు ఎత్తడం, కాల్వల్లో నీటి పారుదలకు అడ్డులేకుండా చూడడం, అక్రమంగా ఎవ్వరూ నీటిని తరలించకుండా చూడడం, కంపచెట్లు పెరగకుండా చేయడంలో లష్కర్లదే కీలక పాత్ర. వందల కిలోమీటర్ల మేర ఎలాంటి అడ్డంకులు లేకుండా నీటిని తరలించే బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత లష్కర్లపై ఉంటుంది. ఇలాంటి లష్కర్లు ప్రస్తుతం గాలిలో దీపంలా ఉన్నారు.

కీలకంగా లష్కర్లు

పులివెందుల నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో కాల్వల్లో ఎటువంటి సమస్యత లెత్తకుండా నీటి తరలింపును పర్యవేక్షించేందుకు 2020 సెప్టెంబరులో దాదాపు 120 మంది లష్కర్లను ఇరిగేషన్ శాఖ నియమించుకుంది. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ద్వారా బిల్లులు చెల్లించేలా కాంట్రాక్ట్ ఏర్పాటు చేసి ఆ కాంట్రాక్టర్ ద్వారా నెలకు రూ.7వేల వేతనం ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. కాల్వల్లో ఉన్న పూడికను తొలగించడం, కాల్వలపై ఉన్న ముళ్లపొదలను తొలగించడం, పంప్‌హౌస్‌ను క్లీనింగ్ చేయడం, కాల్వల్లో నీరు సక్రమంగా వెళుతోందా లేదా అని పర్యవేక్షించడం వీరి విధి. దీంతో నిరంతరం కాల్వలపై ఎండననక, వాననక, రాత్రింబవళ్లు లష్కర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగు నెలలకు, ఐదు నెలలకు ఒకసారి వేతనం ఇస్తున్నప్పటికీ, తక్కువ వేతనం అయినా.. భవిష్యత్తు బాగుంటుందనే ఆశతో వారు విధులు నిర్వహిస్తూ వచ్చారు. గత ఏడాది రూ.3 వేలు వేతనం పెరగడంతో ఇక తమ జీవితాలు బాగుపడతాయని ఆశించారు. సీఎం వైఎస్ జగన్ సొంత నియోజకవర్గం కావడంత తమ ఉద్యోగాలు పర్మనెంటు చేస్తారనీ నమ్మారు. ఇంతగా ఆశపడ్డ లష్కర్లకు ఒక్కసారిగా వారి జీవితం చీకటిమయం అయిపోయింది. గత ఏడాది డిసెంబరుతో కాంట్రాక్ట్ అయిపోయిందని ఇరిగేషన్ అధికారులు లష్కర్లకు తెలిపారు. ప్రస్తుతం విధులకు హాజరు అయినా జీతాలు చెల్లించే అవకాశం లేదని తేల్చిచెప్పినట్లు సమాచారం.

భవిష్యత్తుకు భరోసా ఇవ్వండి

తమ భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలంటూ లష్కర్లు వేడుకుంటున్నారు. తమపై ఆధారపడ్డ కుటుంబాలు ఉన్నాయని, అరకొర జీతం అయినప్పటికి భవిష్యత్తు బాగుంటుందనే ఉద్దేశంతో పనులు చేశామని చెబుతున్నారు. ఉన్నట్లుండి డిసెంబరుతో కాంట్రాక్ట్ అయిపోయిందని, ఇక జీతాలు రావని చెప్పడంతో ఏం చేయాలో తమకు అర్థం కావడం లేదన్నారు. అధికారులను అడిగితే మీ శ్రమ వృథా కానివ్వం అని చెబుతున్నారే తప్ప కచ్చితమైన హామీ రాలేదని అంటున్నారు. ముఖ్యమంత్రి స్పందించి తమను ఆప్కాస్ కింద నియమించి లష్కర్లుగా కొనసాగించాలని కోరుతున్నారు. లష్కరు లేకుండా నీటి రిజర్వాయర్ల కాల్వల నిర్వహణ సాధ్యం కాదు. వీరిని కొనసాగించి నీటి పారుదలలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పులివెందుల నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. వీరి ఎమ్మెల్యే, సీఎం అయిన వైఎస్ జగన్ ఏమేరకు స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

వేతనాలు ఇచ్చే ఏర్పాట్లు చేస్తాం

లష్కర్లు లేకుండా వాటర్ రెగ్యులేషన్ కష్టమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. లష్కర్లకు ఎలాగోలా వేతనాలు ఇచ్చే ఏర్పాట్లు చేస్తాం.

– ప్రదీప్‌రెడ్డి, డీఈ, ఇరిగేషన్, పులివెందుల

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్



కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13 : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటిస్తూ ప్రయాణం చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫకృద్దీన్ సూచించారు. మంగళవారం కడప నగరం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో 35వ జాతీయ రహదారి భద్రతా మహోత్సవాల సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ప్రజారవాణాలో మహిళలకు రహదారి భద్రత, బస్సుల్లో మహిళల సీట్ల ప్రాధాన్యత, 354ఎ ఐపీసీ 506 ఐపీసీతో పాటు మరికొన్ని చట్టాలు సెక్షన్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మీరా ప్రసాద్, ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐ నసీం, కళాశాల ప్రిన్సిపల్ సలీంబాషా, లెక్చరర్లు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ : ఒకరి మృతి



మృతిచెందిన లక్ష్మీ శేఖర్

పుల్లంపేట, ఫిబ్రవరి13 : పుల్లంపేట మండలం ప్రకాష్ నగర్ కాలనీ వద్ద కడప-చెన్నై రహదారిలో మంగళవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఇరువురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు అనంతంపల్లెకు చెందిన మేకల లక్ష్మీశేఖర్ (20), రంగంపల్లె పంచాయతీ ఉప్పరపల్లె గ్రామానికి చెందిన సాయిలు రాజంపేట నుంచి ఇంటికి వెళుతున్నారు. అదే సమయంలో ముందు స్కూటీపై వెళుతున్న బోయనపల్లెకు చెందిన రామ్మోహన్ ప్రకాష్ నగర్ కాలనీ సమీపంలోకి రాగానే స్కూటీని పక్కకు తిప్పడంతో వెనుక వస్తున్న బైకు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీశేఖర్ అక్కడికక్కడే మృతి చెందారు. సాయి తీవ్రంగా గాయపడగా రామ్మోహన్ స్వల్పంగా గాయపడ్డాడు. రామ్మోహన్ విద్యుత్ శాఖలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తీవ్రంగా గాయపడిన సాయి, స్వల్పంగా గాయపడిన రామ్మోహన్‌ను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సాయిని తిరుపతికి రెఫర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పుల్లంపేట ఎస్ఐ రఘురాం తెలిపారు.

బొలేరా ఢీ...వ్యక్తికి తీవ్రగాయాలు

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి13: మండలంలోని రవీంద్రనగర్ మర్రిమాను వద్ద మంగళవారం నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి వచ్చిన బొలేరో ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మద్దిరేవుల పంచాయతీ జీఎంఆర్ కాలనీకి చెందిన విజయ్ అనే వ్యక్తి పనిమీద లక్కిరెడ్డిపల్లెకు వచ్చి వెళుతూ మర్రిచెట్టు వద్దకు వచ్చేసరికి ఫోన్ వచ్చింది. దీంతో బైకును ఆపి ఫోన్‌లో మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన బొలేరా వాహనం బైకును ఢీ కొట్టడంతో విజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈమేరకు వెంటనే 108 వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించ ఆసుపత్రిలో డాక్టర్లు ఎవరూ లేకపోవడంతో ఓ నర్సు చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమించడంతో క్షతగాత్రుని బంధువులు కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు తరలించారు. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వస్తే డాక్టర్ లేకుంటే ఎలా అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

40 గొర్రెలు మృతి, మరికొన్నింటికి తీవ్రగాయాలు



లారీ దూసుకెళ్లడంతో నుజ్జునుజ్జయిన గొర్రెలు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 13 : ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లె వద్ద జమ్మలమడుగు రోడ్డులో మంగళవారం తెల్లవారుజామున గొర్రెలమందపై లారీ దూసుకెళ్లిన ఘటనలో 40 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందాయి. మరికొన్నింటికి తీవ్ర గాయాలయ్యాయి.వివరాల్లోకి వెళితే జమ్మలమడుగు నియోజకవర్గం బొమ్మేపల్లెకు చెందిన చౌడయ్యచంద్రానాయక్ గొర్రెల మందను తీసుకుని జమ్మలమడుగునుంచి దువ్వూరుకు వెళుతున్నారు. కాగా మంగళవారం తెల్లవారుజామున 5గంటల సమయంలో గుర్తు తెలియని లారీ గొర్రెల మందపై దూసుకెళ్లింది.దీంతో గొర్రెలన్నీ నుజ్జునుజ్జు అయ్యాయి. గొర్రెల యజమాని చౌడయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గన్‌మెన్ల కేటాయింపులో ప్రతిపక్షాలపై వివక్ష

● చీఫ్ ఎన్నికల కమిషనర్‌కు ఎమ్మెల్సీ ఫిర్యాదు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 13: రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం పోలీసులతో భద్రత కల్పించిందని అయితే అధికార, ప్రతిపక్ష పార్టీలకు గన్‌మెన్లను కేటాయించడంలో వివక్ష చూపించారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఆరోపించారు. రక్షణ కల్పించడంలో ఉన్నతాధికారులు పారదర్శకంగా వ్యవహరించే విధంగా తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు చీఫ్ ఎన్నికల కమిషనర్‌కు ఆయన ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి కనీసం 2 ప్లస్ 2 నుంచి 4 ప్లస్ 4 భద్రత కేటాయించారన్నారు. ప్రతిపక్ష పార్టీలకు 1 ప్లస్ 1 మాత్రమే ఇచ్చారని ఇది ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రతిపక్షాలకు ఈ రాష్ట్రంలో భద్రత లేదని దీన్ని సరిదిద్దేందుకు తగు చర్యలు తీసుకోవాలని మనవి చేశారు. రాష్ట్రంలో ఎవరికి భద్రత కల్పించాలన్నా సెక్యూరిటీ రివ్యూ కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంటారన్నారు. ఇక్కడ మాత్రం అధికార పార్టీ వారు ఎవరికి చెబితే వారికే గన్‌మెన్లను ఇస్తున్నారన్నారు. ఇంకా కొంత మంది నాయకులకు వెపన్ లేకుండా గన్‌మెన్లను ఇచ్చారన్నారు. ఇది పూర్తిగా అధికార దుర్వినియోగమేనని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్నికి ఆహుతైన అరటి తోట



పులివెందుల టౌన్, ఫిబ్రవరి 12: మండలంలోని ఇ.కొత్తపల్లెలో అరటి పంట అగ్నికి ఆహుతైన సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన వాడపల్లె బాష అనే రైతు నాలుగు ఎకరాలలో అరటి సాగు చేశారు. మరో రెండు నెలల్లో దిగుబడులు వస్తాయి. ఈ సమయంలో సోమవారం సాయంత్రం ఉన్నఫళంగా అరటితోట అగ్నికి ఆహుతైంది. ప్రమాదానికి కారణమైతే తెలియలేదు. మరో రెండు నెలల్లో కోతకు వచ్చే సమయంలో అరటి పంట అగ్నికి ఆహుతవడంతో దాదాపు రూ.8లక్షలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

విద్యార్థి అదృశ్యం



బద్వేలు టౌన్, ఫిబ్రవరి 13 : పట్టణంలోని ముబారక్‌కాలనీ మదరసాలో చదువుతున్న సయ్యద్ అమానుల్లా బుఖారీ (17) అనే విద్యార్థి ఆదివారం మదరసా పాఠశాలలో అదృశ్యం కావడంతో మంగళవారం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కడప పట్టణం రవీంద్ర నగర్‌కు చెందిన సయ్యద్ అమానుల్లాబుఖారీ బద్వేలు పట్టణంలో ముబారక్ కాలనీలో ఉండే మదరసాలో చదువుతున్నాడు. అయితే ఇంటి వద్ద నుంచి విద్యార్థి తల్లి మదరసా పాఠశాలకు ఫోను చేసి తమ కుమారుడిని ఇంటికి పంపాలని కోరగా అక్కడి టీచర్లు అబ్బాయిని పాఠశాల నుంచి పంపించారు. విద్యార్థి పాఠశాల నుంచి ఇంటికి వెళ్లకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు బంధువుల ఇళ్లలకు ఫోను చేశారు. వారు రాలేదని చెప్పడంతో మంగళవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జనసేన రాయలసీమ జోన్-1 కో కన్వీనరుగా పంద్ర



పంద్ర రంజిత్‌కుమార్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13 : జనసేన ఎన్నిక కార్యక్రమాల నిర్వహణ రాయలసీమ జోన్-1 కమిటీ కో-కన్వీనరుగా పంద్ర రంజిత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జనసేన 2024 ఎన్నికల కార్యక్రమాల నిర్వహణకు తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. పవన్ కళ్యాణ్ ఆదేశాలు పాటిస్తూ రాయలసీమ జోనల్ పరిధిలోని నియోజకవర్గాల్లో జనసేన పార్టీ కార్యక్రమాలు, సభల విజయవంతానికి కృషి చేస్తానని తెలిపారు.

జిల్లా పోలీసు శాఖ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరుగా బి.రాజాప్రభాకర్

కడప (క్రైం), ఫిబ్రవరి 13 : జిల్లా పోలీసు శాఖ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరుగా బి.రాజాప్రభాకర్‌ను నియమిస్తూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, సోషల్ మీడి యాలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు పోలీసు శాఖ, మీడియాకు వారధిగా ప్రభాకర్ వ్యవహరిస్తారన్నారు.

మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డర్ అవార్డు గ్రహీత మృతి



కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 13 : కడపకు చెందిన మిస్టర్ ఆంధ్ర (బాడీబిల్డర్) అవార్డు గ్రహీత షంషుద్దీన్(63) గుండెపోటుతో మంగళవారం సాయంత్రం కడపలో మరణించారు. ఆయన మృతికి బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నూనె నగేష్, షేక్ యూనస్ బాషాలు తమ సంతాపం వ్యక్తం చేశారు.

మద్యం బాటిళ్ల పట్టివేత- ముగ్గురు అరెస్టు



కడప (క్రైం), ఫిబ్రవరి 13 : కడప నగరం మహావీర్ సర్కిల్ వద్ద మద్యం బాటిళ్లు అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సెబ్ ఎస్ఐ తెలిపారు. కమలాపురం మండలం గంగవరం గ్రామానికి చెందిన బాలస్వామి, శివరాం, పలిబాలును అరెస్టు చేసి వారి నుంచి 318 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

● నేటి నుంచి ప్రత్యక్ష ఆందోళనలు ● 27న చలో విజయవాడ ● ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో మొండిగా వ్యవహరిస్తే బుధవారం నుంచి ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధం కాక తప్పదని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ హెచ్చరించారు. నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులు ప్రభుత్వానికి సహకరిస్తున్నప్పటికీ సరైన స్పందన లేదన్నారు. ఈనెల 12వ తేదీన బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఏపీ జేఏసీ జరిపిన చర్చలు కొలిక్కి రాలేద న్నారు. దీంతో ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టక తప్పదన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే బుధవారం నుంచి ప్రత్యక్ష ఆందోళనలకు దిగడంతో పాటు ఈనెల 27 చలో విజయవాడ చేపడతామన్నారు. 12వ పీఆర్సీ 30 శాతం ప్రకటించాలని, సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలు, సీపీఎస్ వారికి డీఏ బకాయిలు 90 శాతం నగదు రూపంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. 11 వ పీఆర్సీ, అరియర్స్, సరెండర్ లీవ్ బకాయిలు, పీఎఫ్, మెడికల్ రీయింబర్సుమెంట్ క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలని, ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకై ఉద్యమ కార్యచరణకు సిద్ధమంటూ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ





దొంగలు పగలగొట్టిన బీరువా, ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పట్టణ సీఐ

రాజంపేట టౌన్, ఫిబ్రవరి13 : మండల పరిధిలోని కూచివారిపల్లె శివారులోని రెండిళ్లలో మంగళవారం పట్టపగలే దొంగలు పడ్డారు. పట్టణ సీఐ మద్దెయ్య ఆచారి తెలిపిన వివరాల మేరకు గ్రామ శివారులోని బాబు నాయుడు, రెడ్డిప్రసాద్ కుటుంబ సభ్యులు ఇళ్లకు తాళాలు వేసి పెళ్లికి వెళ్లారు. ఈ విషయం గమనించిన దుండగులు తాళాలు పగులగొట్టి ఇళ్లలో చొరబడ్డారు. బాబు నాయుడు ఇంట్లో 150 గ్రాముల బంగారం, రెడ్డిప్రసాద్ ఇంటిలో రెండు జతల కమ్మలు, మాటీలు, ఉంగరాలు చోరీ చేయడమే కాకుండా బీరువాలోని నగదు కూడా దోచుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దోచుకెళ్లిన వస్తువుల విలువ సుమారు మూడు లక్షలు రూపాయలు ఉంటుందని వివరించారు.

పాత పెన్షన్‌పై పార్టీల వైఖరి తెలపాలి

● యూటీఎఫ్ పోస్టు కార్డులు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 13 : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఉద్యోగ ఉపాధ్యాయుల పదవీ విరమణ అనంతరం సమాజంలో గౌరవంగా జీవించడానికి పాత పెన్షన్ విధానం అవసరమని.. అలాంటి పాత పెన్షన్ విధానంపై రాజకీయ పార్టీల వైఖరి ఏంటో తెలపాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం కడప నగరం ప్రధాన కార్యాలయం వద్ద అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు పోస్టు కార్డు ద్వారా తమ డిమాండ్లను తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మా భవిష్యత్తు నిర్ణయించేది మేం ఎన్నుకునే నాయకులే కావచ్చు.. అయినా మా సమస్యలు పరిష్కరించలేనపుడు వారి రాజకీయ భవిష్యత్తు నిర్ణయించేది కూడా మా ఓటేనన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అందుకే ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో ఎవరైతే పాత పెన్షన్ ఇస్తామని మేనిఫెస్టో చేసి అధికారంలోకి వచ్చాక మొదటి సంతకం చేస్తారో వారికే తమ ఓటుతో పాటు మా కుటుంబ సభ్యులు ఓట్లు కూడా వేయిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వానికి ఉద్యోగ ఉపాధ్యాయులు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమణ, ఎజాజ్ అహ్మద్, గోపినాథ్, అబ్దుల్‌గణి, ఇహాజితుల్లా, సుజిత్‌కుమార్, వీరనారాయణ పాల్గొన్నారు.



పోస్టుకార్డులు చూపుతున్న యూటీఎఫ్ నేతలు

విజిలెన్సు దాడుల్లో రేషన్‌బియ్యం పట్టివేత



రేషన్‌బియ్యం వాహనాన్ని పట్టుకున్న విజిలెన్సు అధికారులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 13 : ప్రొద్దుటూరులో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్సు అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో టాటా ఏసీ వాహనంలో దాదాపు 45 రేషన్‌బియ్యం బస్తాలను అక్రమంగా తరలిస్తుండటంతో బొల్లవరం గ్రామం పొట్టిపాడురోడ్డు వద్ద విజిలెన్సు అధికారులు పట్టుకున్నారు. దాదాపు 2090 కేజీలుండే రేషన్‌బియ్యం సుమారు రూ.2,84 640 విలువ చేస్తాయని విజిలెన్సు అధికారులు తెలిపారు. ఈరేషన్ బియ్యాన్ని ప్రొద్దుటూరుకు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ప్రొద్దుటూరు దాని చుట్టుపక్కల గ్రామాలనుంచి సేకరించి నరేంద్ర అనే వ్యక్తికి విక్రయించటానికి వెళుతుండగా విజిలెన్సు అధికారుల తనిఖీల్లో బయటపడ్డాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంఎల్ఆర్ఐ సాయిప్రసాద్, విజిలెన్సు సీఐ రెడ్డెప్ప, హెడ్‌కానిస్టేబుల్ జనార్ధనరావు, కానిస్టేబుల్ రంతుబాష పాల్గొన్నారు. బియ్యం అక్రమ రవాణాపై త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్‌కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ప్రమాదవశాత్తు కుందూలో పడి వ్యక్తి మృతి



రాజుపాలెం, ఫిబ్రవరి 13 : దువ్వూరు మండలం కానగూడూరు గ్రామానికి చెందిన గుడిపాటి హుస్సేన్‌బాషా (35) అనే వ్యక్తి మంగళవారం ప్రమాదవశాత్తు కుందూనదిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టంగుటూరు గ్రామ పొలంలోని తమ పొలం వద్ద పనిచేసుకుంటూ కుందూనది వద్దకు నీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి ఊపిరి ఆడక మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతుడికి కుమార్తె ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది

కాంగ్రెస్ మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 13: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఓటమి భయం పట్టుకుని మాట్లాడుతున్నాడని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షర్మిలపై వైసీపీ నాయకులు చేత జగన్‌మోహన్‌రెడ్డి అసభ్యపదజాలం ఉపయోగించి మాట్లాడించడం మంచి పద్ధతి కాదన్నారు. చెల్లిని అవమానకరంగా మాట్లాడితే తన తల్లికి కూడా తగులుతుందన్న ఇంకిత జ్ఞానం కూడా లేకుండా.. షర్మిల రాజశేఖర్‌రెడ్డి కూతురు కాదని మాట్లాడించడం రాజశేఖర్‌రెడ్డి సతీమణిగా విజయమ్మను అవమానించడమేనని ఆయన విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి కోసం షర్మిల పనిచేసినప్పుడు మంచి వ్యక్తిగా కనబడి ఇప్పుడు ఎలా చెడ్డ వ్యక్తి అయ్యారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో టీడీపీ, వైసీపీ నాయకులు పెద్దఎత్తున సంప్రదింపులు జరుపుతున్నారని.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలపడటంతో పాటు అధికారమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు.

కర్ణాటక, తెలంగాణాలో కాంగ్రెస్ సత్తా చాటిందని.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా రానున్న ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవితాశయం రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే అని.. ఆయన చనిపోయే ముందు కూడా ప్రకటించారని.. ఆ లక్ష్యం కోసమే తన కుమార్తె షర్మిల పనిచేస్తున్నారని తులసిరెడ్డి అన్నారు. రాజంపేట కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి మనోహర్ బాబు, నాయకులు శ్రీనివాసులు, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

● పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 13:వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరం ద్వారకనగర్‌లోని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి నివాసంలో 25వ డివిజన్ కో ఆపరేటివ్ కాలనీవాసులు టీడీపీలో చేరారు. వారికి శ్రీనివాసరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నా రు. రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా కృషి చేయాలన్నా రు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు.

36వ డివిజన్‌లో...

కడప నగరం 36వ డివిజన్‌లో స్థానికులు అధిక సంఖ్యలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 36వ డివిజను ఫరూక్ హుసేన్, అమీర్, అఫ్రోజ్, ఇమ్రాన్, ఖురేషీ, సుభాని, ఫిదా, ముస్తాక్, నాగరాజ్, దిలీప్, సత్తి, చైతన్య, వాసు టీడీపీలో చేరారు.

నిరుద్యోగులతో ముఖాముఖి పోస్టరు విడుదల

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మంగళవారం నిరుద్యోగులతో ముఖాముఖి పోస్టరును విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కడప నగరంలో ఈ నెల 18న హరిత హోటల్‌లో ఉదయం 10గంటలకు 'నిరుద్యోగుల ప్రశ్నలకు ప్రభుత్వం సిద్ధమా..' అనే కార్యక్రమం జరుగుతుందని, దీన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

టోర్నమెంటు ప్రారంభం

కడప నగరం మాచుపల్లె రోడ్డు మైదానంలో మంగళవారం ఆర్ఎస్ఆర్ ప్రీమియం లీగ్ టోర్నమెంటును టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. టీడీపీ 4, 5 డివిజన్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బెస్త సాధికార సమితి రాష్ట్ర కన్వీనరు యాటగిరి రాంప్రసాద్, చక్రి, సురేష్ పాల్గొన్నారు.



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన డీఎస్పీ

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 13 : కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రాంగణంలో ఉన్న పోలింగ్ బూత్‌లను దిశ డీఎస్పీ రమాకాంత్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాట్లను పరిశీలించిఅనంతరం సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రాబోవు ఎన్నికలు చాలా కట్టుదిట్టంగా నిర్వహిస్తామని ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు ఉండకూడదన్నారు. పోలింగ్ బూత్‌లలో సమస్యలు ఉంటే త్వరగా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ రమాకాంత్

సమష్టి కృషితోనే టీడీపీ బలోపేతం

వేంపల్లె, ఫిబ్రవరి 13: రానున్న ఎన్నికల్లో సమష్టి కృషితోనే టీడీపీ బలోపేతం అవుతుందని ఆ పార్టీ వేంపల్లె మండల పరిశీలకులు అజ్జుగుట్ట రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. త్వరలో బీటెక్ రవి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బాబు ష్యూరిటీ కార్యచరణపై చర్చించారు. గతంలో టీడీపీలో ఉంటూ పార్టీకి దూరంగా ఉన్న వారందరిని కలుపుకొని పోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మా ట్లాడుతూ ప్రతి కార్యకర్త రెండు నెలలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీకి రానున్నవి మంచి రోజులని, అధికారం రావడం తథ్యమని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు రఘునాథరెడ్డి

అంటువ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించండి

వల్లూరు, ఫిబ్రవరి 13: అంటువ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఎంహెచ్ఓ నాగరాజు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని లేబాక గ్రామంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్షను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ పనిచేస్తున్న ఏఎన్ఎంలతో, వైద్యులతో మాట్లాడారు. వచ్చిన ప్రతి వారిని చిరునవ్వుతో పలకరించి వారి వ్యాధులు అడిగి తెలుసుకోవాలన్నారు. ము ఖ్యంగా వారిలో ఏవైనా పెద్ద పెద్ద లోపాలు ఉంటే వెంటనే కడప రిమ్స్ కు రెఫర్ చేయాలన్నారు. అనంతరం వారికి తగిన సలహాలు, సూచనలు అందించారు. వీరి వెంట ఎంపీడీఓ విజయభాస్కర్, సచివాలయ సిబ్బందితో పాటు వైద్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నాగరాజు

రేపటి లోపు రబీ పంటల నమోదు పూర్తి చేయాలి

● జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

సింహాద్రిపురం, ఫిబ్రవరి 13: రబీ సీజన్‌కు సంబంధించి పంట నమోదు కార్యక్రమం ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు ఆర్బీకే సిబ్బందికి సూచించారు. మండలంలోని బలపనూరు గ్రామ ఆర్బీకేను సందర్శించి పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం వ్యవసాయ సిబ్బందికి ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేయించిన ప్రతి రైతుకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. ఈకేవైసీ చేయించకుంటే రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలకు అనర్హులు అవుతారన్నారు. పీఎమ్ కిసాన్‌కు ఈకేవైసీ కూడా తప్పనిసరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో ముద్దనూరు వ్యవసాయ ఉపసంచాలకులు వెంకట సుబ్బయ్య, డివిజనల్ వ్యవసాయాధికారులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న నాగేశ్వరరావు

నేడు మండల మీట్

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 13: వీరపునాయునిపల్లె ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఉదయం 10గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

'ప్రజాస్వామ్యవాదులు ఏకం కావాలి'

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 13 : దేశంలో ముఖ్యంగా బీజేపీ పాలిత అస్సాం, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ముస్లిం, వారి ఆస్తులపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నాయని ఇందుకు నిరసనగా ప్రజాస్వామ్యవాదులు ఏకం కావాలని ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మగ్బుల్ బాషా పిలుపునిచ్చారు. మంగళవారం తమ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం వచ్చాక కక్షపూరితంగా ముస్లిం ఆస్తులను, ప్రార్థనా స్థలాలను ధ్వంసం చేశారన్నారు. రాజ్యాంగంపై ప్రమాణాలు చేసిన ప్రభుత్వాలే రాజ్యాంగ ఉల్లంఘటనకు పాల్పడడం దారుణమన్నారు. వీటిపై లౌకిక, ప్రజాస్వామ్య వాదులను కలుపుకుని ప్రజా పోరాటాలే మార్గమని, వీటిపై కలిసికట్టుగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స మావేశంలో ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షావల్లి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ అన్వర్

వేంపల్లె, ఫిబ్రవరి 13: కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా పోరుమామిళ్లకు చెందిన డాక్టర్ అన్వర్ నియామకమైనట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. రాష్ట్ర మైనార్టీ సెల్ చైర్మన్ దాదాగాంధీ నియమించగా ఆ నియామకపత్రాన్ని వేంపల్లెలో తులసిరెడ్డి మీదుగా అన్వర్ అందుకున్నారు. తులసిరెడ్డి మాట్లాడుతూ మైనార్టీలలో కాంగ్రెస్ పట్ల సానుకూలత వచ్చే విధంగా విస్తృత ప్రచారం చేయాలని, ప్రతి మండలానికి మైనార్టీ సెల్ అధ్యక్షులను నియమించాలని తులసిరెడ్డి అన్వర్‌కు సూచించారు.



అన్వర్‌కు నియామకపత్రం అందిస్తున్న తులసిరెడ్డి

సమ్మెను విజయవంతం చేయండి: సీఐటీయూ

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 13 : కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 15న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, శివకుమార్, దస్తగిరిరెడ్డి, అన్వేష్ పిలుపునిచ్చారు. మం గళవారం సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇందులో భాగంగా పాతబస్టాండు, ఏడురోడ్ల కూడలి, గోకుల్ సర్కిల్, వన్‌టౌన్, హెడ్ పోస్టాఫీసు, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు వరకు నిరసన ర్యాలీ ఉంటుందని, జయప్రదం చేయాలని కోరా రు. మోదీ హయాంలో ఒక వైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసేందుకు నల్లచట్టాలు తెచ్చారన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అన్నివర్గాల ప్రజలు ఏకం కావాలన్నారు. 16న జరిగే దేశ వ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ ప్రాంత బంద్ జయప్రదం చేయాలని జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడు గండిలో టెండర్, బహిరంగ వేలం

చక్రాయపేట, ఫిబ్రవరి 13: గండి క్షేత్రంలో ఈనెల 14న ఇ-టెండరు/సీల్డ్ టెండరు, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆలవలపాటి ముకుందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తలనీలాల పోగుకు, టెంకాయల చిప్పలసేకరణకు వేలం ప్రకటన ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భక్తాదులు సమర్పించు తలనీలాలు పోగుచేసుకునే హక్కుకు రూ.20లక్షలు డిపాజిట్, టెంకాయలపై చిప్పను సేకరించుకునే హక్కుకు రూ.2లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. టెండర్ దక్కించుకున్న వారికి తలనీలాలకు 01.03.2024 నుంచి 28.02.2025 వరకు, టెంకాయల చిప్పలకు 01.03.2024 నుంచి 28.02.2025వరకు హక్కు ఉంటుందని తెలిపారు. ఏపీఇప్రొక్యూర్‌మెంట్.జిఓవి.ఐఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా రాహుకాల పూజలు



దీపాలను వెలిగిస్తున్న భక్తులు(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి

కడప (కల్చరల్), ఫిబ్రవరి 13: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను అత్యంత భక్తిశ్రద్ధలతో వెలిగించి ఆ తల్లి శరణు కోరారు.

ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణత సాధించాలి: కమిషనర్

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 13:ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణత సాధించాలని కమిషనరు ప్రవీణ్ చంద్ కోరారు. విద్యార్థులు ప్రతి రోజూ ఉదయం 10 నిమిషాల పాటు మెడిటేషన్ చేయడం ద్వారా వారి జ్ఞాన సంపత్తి పెరుగుపడుతుందన్నారు. మంగళవారం కడప నగరం జడ్పీ బాలికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడుతూ కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అలాగే పౌష్టికాహార విషయంలో ఎటువంటి అలసత్వం చూపవద్దని ఉపాధ్యాయులకు ఆదేశించారు. అలాగే పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలపై భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో చదవాలని సూచించారు. పరీక్షల్లో కూడా భయాన్ని విడిచి ప్రతి ప్రశ్నను క్షుణ్ణంగా చదివి సమాధానం రాయాలన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌చంద్

హామీలను తక్షణం జీఓల రూపంలో ఇవ్వాలి: ఏఐటీయూసీ

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 13 : మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను తక్షణమే జీఓల రూపంలో విడుదల చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారకరామారావు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి మాట్లాడారు. మున్సిపల్ కార్మిక సంఘాలతో సమ్మె కాలంలో చర్చలు సందర్భంగా 15వేలు స్థానంలో 21వేలు మూలవేతనంగా ఇస్తామని తెలిపారని, పీఆర్సీలో ఫిట్‌మెంటు కనీసం 30 శాతం ప్రకటిస్తే 6వేలు వేతనం కార్మికుడికి పెరుగుతుందని, హెవీ, లైట్ వెహికల్ డ్రైవర్లకు 24వేల వేతనం ఇస్తామన్నా హామీలు జీఓల రూపంలో ఇస్తామని కాలయాపన చేయడం తగదన్నారు. కార్మికులకు నష్టం కలగకుండా సమ్మె కాలంలోని వేతనం చెల్లిస్తామని జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీల అమలుకు ముందుకు రావాలన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, బక్కా రాజేష్, కోశాధికారి వెంకటాద్రి, నాయకులు చంద్ర, పోతు, మేళంగి రాజశేఖర్ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

వైవీయూలో ఆర్వో ప్లాంటు ప్రారంభం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13 : వైవీయూ ప్రాంగణంలోని పాత ఆర్ట్స్ బ్లాక్‌లో నూతన ఆర్వో ప్లాంటును వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రారు ప్రొఫెసరు వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా చింతా సుధాకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో తాగునీరు నిత్యం అందరికీ అందుబాటులో ఉండే లా శుద్ధ జలప్లాంటును ప్రారంభించామన్నారు. ఇప్పటికే యూనివర్సిటీలో 9 ఆర్వోప్లాంట్లు ఉన్నాయని ఇది పదోదన్నారు. దీని ఏర్పాటుకు ఎల్ఐసీ 1.20 లక్షల ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవీయూ ఇంజనీర్ ఎం.రాజశేఖర్‌రెడ్డి, కె.రామచంద్రారెడ్డి, ప్రొద్దుటూరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసరు నాగరాజు, వైవీయూ ప్రొఫెసరు ఎంవీ శంకర్, కె.క్రిష్ణారావు పాల్గొన్నారు.



ఆర్వోప్లాంటును ప్రారంభిస్తున్న వైస్‌చాన్సలర్, రిజిస్ట్రారు, ప్రిన్సిపాల్

46వ డివిజన్‌లో జనసేనలోకి చేరికలు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13 : కడప నగరం 46వ డివిజన్ అక్కాయపల్లెలో మంగళవారం స్థానికులు జనసేన పార్టీలో చేరారు. వారికి ఉమ్మడి కడప జిల్లా కో ఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతకు జనసేన అండగా ఉంటుందన్నారు. జనసేన నాయకులు సురేష్, పత్తి విస్సు, ఉంగరాల విజయ్, నాగేంద్ర, శేషు, ఫ్రాన్సిస్, మాలేశివ, హరిరాయల్, అజయ్, తరుణ్, అనిల్, ఆలీ పాల్గొన్నారు.



జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుంకర శ్రీనివాస్

ఆరోగ్యసురక్షకు స్పందన అంతంత మాత్రమే

చెన్నూరు, ఫిబ్రవరి 13 : చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి స్పందన అంతంత మాత్రమే వచ్చింది. అవగాహన లోపంతోనే చాలా మంది ఈ శిబిరానికి హాజరు కాలేదు. పైగా ప్రజల్లోకి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లున సమాచారం వెళ్లకపోవడంతో చాలా మంది రాలేదు. దీంతో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. కేవలం మమ అనిపించడమే తప్ప ఏ మాత్రం స్పందన లేదు. మధ్యాహ్నం నుంచి ఏదో వచ్చామన్నట్లుగా కొంతమంది మాత్రమే వచ్చారు.



చెన్నూరు ఆరోగ్య సురక్షలో ఖాళీగా కనిపించిన కుర్చీలు

ఐఐటీ, జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో బీరం విద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13 :జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో బీరం జూనియర్ కళాశాల విద్యార్థులు అరుదైన రికార్డులు సొంతం చేసుకున్నారని కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి తెలిపారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99 శాతానికి పైగా నలుగురు విద్యార్థులు 98 శాతానికి పైగా ఆరుగురు విద్యార్థులు, 95 శాతానికి పైగా 11 మంది విద్యార్థులు, 90 శాతానికి పైగా 17 మంది పర్సంటైల్ సాధించారన్నారు. ఈ విజయోత్సవంలో కరస్పాండెంట్‌తోపాటు చైర్ పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ కళాశాల స్థాపించిన అతి తక్కువ కాలంలోనే మొదటి బ్యాచ్‌తోనే ర్యాంకులు సాధించడమే కాకుండా రెండో బ్యాచ్‌లో కూడా ర్యాంకులు సాధించిన భవిష్యత్తులో ఇటువంటి ర్యాంకుల పరంపర కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్వేత, హేమచందర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి

గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థుల విజయదుందుభి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13 :జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారని ప్రిన్సిపాల్ తెలిపారు. జతిన్, మోహనక్రిష్ణ, లోకేశ్‌రెడ్డి, భరత్‌కుమార్‌రాజు, బండారు స్వాతి, తనూజ్‌కుమార్, నరసింహ, రాఘవ, నిఖిల్, జ్యోతి, మరికొంత మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. కళాశాల యాజమాన్యం అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

ఐఐటీ, జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో బీరం విద్యార్థులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13 : జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో బీరం జూనియర్ కళాశాల విద్యార్థులు అరుదైన రికార్డులు సొంతం చేసుకున్నారని కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి తెలిపారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99 శాతానికి పైగా నలుగురు విద్యార్థులు, 98 శాతానికి పైగా ఆరుగురు విద్యార్థులు, 95 శాతానికి పైగా 11 మంది విద్యార్థులు, 90 శాతానికి పైగా 17 మంది పర్సంటైల్ సాధించారన్నారు. ఈ విజయోత్సవంలో కరస్పాండెంట్‌తోపాటు చైర్‌పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ కళాశాల స్థాపించిన అతి తక్కువ కాలంలోనే మొదటి బ్యాచ్‌తోనే ర్యాంకులు సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్వేత, హేమచందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలి

గోపవరం, ఫిబ్రవరి 13 : ప్రజలకు ఏర్పడే సమస్యలపై వెంటనే పరిష్కారం చూపేలా ఆయా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల సమావేశంలో ఎంపీపీ ధనలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సభాభవనంలో మంగళవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రానున్న వేసవిలో మంచినీటి సమస్య ఏర్పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ జయరామిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ నాగరాజు, తహసీల్దారు రోశయ్య మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు సీఎం కావాలి







జమ్మలమడుగు, పోరుమామిళ్ల, ప్రొద్దుటూరులలో ప్రచారం నిర్వహిస్తున్న భూపేశ్‌రెడ్డి, బొజ్జ రోశన్న, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 13: రాష్ట్ర భవిష్యత్తుకోసం చంద్రబాబును ముఖ్యమంత్రి కావాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జమ్మలమడుగు మండలంలోని గండికోట, నర్సోజీ కొట్టాలు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● **30 కుటుంబాలు టీడీపీలో చేరిక..:** గ్రామంలో మంగళవారం సాయంత్రం భూపేశ్‌రెడ్డి సమక్షంలో 30 కుటుంబాలు టీడీపీ కండువా కప్పుకున్నట్లు తెలిపారు. వారిని ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో గండికోట సర్పంచ్ గురుఈశ్వర్, ప్రసాదు, శ్రవణ్, రఘు, శేఖర్, సుబ్బరాయుడు, క్రిష్ణారెడ్డి, ప్రసాద్, శేఖర్, రవి, కరుణకుమార్, సుధాకర్, అనిల్, శ్రీను, శ్రవణ్, రామయ్య, రాజు, హుస్సేన్, తదితరులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, దేవగుడి యూత్ బృందం, పొన్నతోట శ్రీనివాసులు, మల్లికార్జున, జనసేన పార్టీ నాయకులు అల్లం సూర్యరాయల్, వనం గురుకుమార్, సురేష్, నిఖిల్, రాయల్‌కిరణ్, దువ్వూరు మురళి, హరిరాయల్, నర్సోజి కొట్టాల గ్రామ నాయకులు లక్ష్మీనారాయణ, గురప్ప, తిమ్మయ్య, బాస్కర్, ఎర్రన్న, గంగన్న, చంద్ర, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలని బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో పథకాలు వివరిస్తూ మంగళవారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో రాఘవేంద్రనగర్ ప్రాంతాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు భైరవ ప్రసాద్, సర్పంచ్ యనమల సుధాకర్, రంగసముద్రం ఎంపీటీసీ కల్వకూరి రమణ, కల్వకూరి చిన్న వెంకటసుబ్బయ్య, సీతావెంకటసుబ్బయ్య, ఇమాంహుస్సేన్, రామసుబ్బారావు, బండి ఓబులేసు, తిరుమలశెట్టిసుబ్బారావు, కల్వకూరి రమేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: జగన్ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 31 వవార్డు అయోధ్యనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ముందస్తు మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ కౌన్సిలర్‌సీతారామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు జబివుల్లా, మండల టీడీపీ కన్వీనర్ బాబుల్‌రెడ్డి, బండి భాస్కర్‌రెడ్డి, బోగాల లక్ష్మీనారాయణమ్మ, మేరువ మూర్తి, మేరువ నీలిమా, మేరువ కుమార్, మేరువ నరసింహ, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. మంగళవారం తుడుమలదిన్నె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ 6 పథకాలను మహిళలకు వివరించారు.మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి, జనసేన ఇన్‌చార్జి పందిటి మల్హోత్ర, రాంప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి, బాలనాగిరెడ్డి, ఈశ్వరయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి వీరయ్య, సుబ్బయ్య, కదిరుల్లా, నాగశివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పుల్లయ్యనాయుడు, గోవిందు సుబ్బయ్య, కృష్ణారెడ్డి, గంగిరెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

కలసపాడు..: మండలంలోని బూత్ నెంబరు 35లో లింగారెడ్డిపల్లె, నల్లగొండుపల్లె గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎస్‌ఏ రంతుల్లా, మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, పట్టాభిరెడ్డి, భద్రయ్య, నాగశ్వర్‌రావు, రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, దుగ్గిరెడ్డి, మస్తాన్, రాములు, భూపాల్‌రెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



బద్వేలులో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలు రూరల్..: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తప్పనిసరి అని బొజ్జ అరుణ, తెలుగుమహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గొడుగునూరు తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు బైసాని ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, ఆదిలక్షుమ్మ, రవికుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య కాలనీ, 18వ వార్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు పథకాలు వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎద్దుల ప్రసాద్, ఎద్దుల ప్రతాప్, మున్నెల్లి సుధాకర్, నానబాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పేదల కాలనీలపై పాలకుల వివక్ష తగదు

బద్వేలు , ఫిబ్రవరి 13: పట్టణంలోని పేదలు నివాసం ఉంటున్న సుందరయ్య కాలనీ, జ్యోతిబసు కాలనీ, ఐలమ్మ కాలనీ ఏర్పడి నేటికి 20 సంవత్సరాలు అవుతున్నా అక్కడ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు వివక్ష చూపడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆయా కాలనీవాసులతో కలిసి మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు మనోహర్, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, పట్టణ కమిటీ సభ్యులు చాంద్‌బాష, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 13 : కార్మికుల సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ నాయకులు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ కార్మికుల సమ్మె సందర్భంగా పది రోజుల్లో సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు చర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వం నెల రోజులు దాటినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. డివిజన్ కార్యాలయాల్లో మస్టర్ వేయాలని సూచించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

బద్వేలు , ఫిబ్రవరి 13: విద్యార్థులు రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా మంగళవారం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినిలకు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత,ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 13 :రైతు వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో 16న జరిగే గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు సఫా, పీరయ్య పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్లలో మహాత్మాగాంధి సర్కిల్, మహబూబ్‌నగర్ కాలనీల్లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఏఐటీయూసీ మండల సహాయ కార్యదర్శి కేశవ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: ఈనెల 16వ తేదీ జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కరపత్రాలు విడుదల చేశారు. సీపీఎం సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 13 : బెంగళూరుకు చెందిన ఆల్‌సెక్ టెక్నాలజీస్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన 28 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి తెలిపారు. మంగళవారం బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఎగ్జిక్యూటివ్ సపోర్టు ఉద్యోగాల కోసం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలలో బీటెక్ విద్యార్థులు శిల్ప, ప్రదీప్, వెంకటమంజునాథ, మల్లికార్జున, రిత్యాకళ్యాణి, వీరకీర్తి, ఆయేష, కౌసల్య, ఫాతిమ అఫ్సర్, నజియా సుల్తానా, ఫర్హానా, అనిత, తేజస్వి, సుస్మిత, శ్రీహిత, శ్రావణి, అశ్విని, శిరీష, రాజేశ్వరి, ఆర్.శ్రావణి, దత్తసాయి చరణ్ యాదవ్, ఎంబీఏలో విజయ్‌బాబు, ధరణి, తస్లీమ్ ఖానం, తరుణ్‌రాజ్, రసూల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ.2.2 లక్షల వేతనం లభిస్తుందన్నారు. ఆ విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

మరణానికి కారణమైన వారిని శిక్షించాలి

● కుంచాల మృతదేహాన్ని పరిశీలించిన పుట్టా సుధాకర్‌యాదవ్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 13 : మండలంలోని మలుగుడిపాడు గ్రామానికి చెందిన కుంచాల రామ్మోహన్‌రెడ్డి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం బి.కోడూరు మండలం వంకమర్రి గ్రామ సమీప పొలాల్లో రామ్మోహన్‌రెడ్డి మృతదేహాన్ని పాతిపెట్టిన సంఘటనాస్థలం వద్దకు పుట్టా వెళ్లి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రామ్మోహన్‌రెడ్డి ఇటువంటి సంఘటనలు మరొకసారి పునరావృతం కాకుండా హంతకులను కఠినంగా శిక్షించాలని ఎస్పీ సిద్ధార్థకౌశల్‌తో ఫోనులో మాట్లాడారు. అలాగే మృతుని కుటుంబ సభ్యులను పుట్టా సుధాకర్‌యాదవ్ ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బి.మఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, బిమఠం క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వివేకానందరెడ్డి, సర్పంచ్ నారాయణ, రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ జయరామిరెడ్డి,దాసు, నాగచంద్రుడు, మాజీ ఎంపీటీసీ రమేష్, రఫాయిల్, చెన్నుపల్లి జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 13 : యువత మద్యం, మత్తు పదార్థాలను దూరంగా ఉండాలని జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రఫిక్ తెలిపారు. మంగళవారం జమా అతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో భారత్ ఫంక్షన్ హాల్‌లో మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం - ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం అనే అంశంపై బహిరంగ సభ నిర్వహించారు. ఈకార్యక్రమంలో జమా అతె ఇస్లామి హింద్ జాతీయ ఉపాధ్యక్షుడు వలీయుల్లా నయిదీ ఫలాహి పట్టణాధ్యక్షుడు షఫీవుల్లా, మీడియా కన్వీనర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురై హిజ్రా మృతి



మృతి చెందిన వాసవి

కొండాపురం, ఫిబ్రవరి 13 :పట్టణంలోని రామసుబ్బారెడ్డి నగర్‌కు చెందిన వాసవి (30) అనే హిజ్రా పాముకాటుకు గురై మృతిచెందింది. మంగళవారం ఉదయం తన ఇంటిలో నిద్రిస్తుండగా పాముకాటుకు గురయింది.దీంతో ఈమెను తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందినట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫ్యాక్షన్ జోన్‌ను ఎత్తివేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 13 : రాయలసీమలో ఫ్యాక్షన్ హత్యలు, గొడవలను అణచివేయడానికి ఏర్పాటు చేసిన ఫ్యాక్షన్ జోన్ ఎత్తివేయాలని రాయలసీమ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డులో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ 1996లో అప్పటి ప్రభుత్వం ఫ్యాక్షన్ జోన్‌ను ఏర్పాటు చేసిందని, దీని వల్ల సినిమాలో రాయలసీమ ప్రాంతాన్ని చెడుగా చిత్రీకరించడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో ఎటువంటి ఫ్యాక్షన్ హత్యలు, గొడవలు జరగడం లేదని, ఫ్యాక్షన్ జోన్ ఎత్తివేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలాల కబ్జాపై ఆర్డీవోకు ఫిర్యాదు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 13: జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు, రాజీవ్‌నగర్ కాలనీల్లో కొందరు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని విచారణ చేసి కేసులు నమోదు చేయాలని బహుత్తమ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు జక్కాకుల శేఖర్ తదితరులు ఆర్డీవో శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. మంగళవారం గూడెం చెరువు గ్రామానికి చెందిన పద్మశాలీయ సంఘం వారు, మరికొందరు కలిసి ఆర్డీవో కార్యాలయ చేరుకున్నారు. అనంతరం ప్రభుత్వ స్థలాలు కబ్జా చేశారని ఆర్డీవో శ్రీనివాసులుకు వినతి పత్రం అందించి వారు మాట్లాడారు.

కాశినాయన తహసీల్దార్ ఎక్కడ..?

● రెండు వారాలుగా ప్రజలకు అందుబాటులో లేని వైనం

● ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు

కాశినాయన ఫిబ్రవరి13: కాశినాయన తహసీల్దారు గత రెండు వారాలుగా ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో మండల తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు రామచంద్రుడును ప్రభుత్వం బదిలీచేసింది. ఆయన స్థానంలో మొదట తిరుపతి నుంచి వచ్చిన కే.కుప్పయ్యను రెగ్యులర్ తహసీల్దారుగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కానీ "ఆయన వ్యక్తి గత కారణాలరీత్యా విధుల్లో చేరలేదని సమాచారం. అనంతరం కడప ఆర్డీవో కార్యాలంలో కేఆర్ఆర్‌సీ తహసీల్దారుగా పనిచేస్తున్న వీఎస్‌వీఆర్ క్రిష్ణను నియమిస్తూ కలెక్టర్ రెండోసారి ఉత్తర్వులు జారీచేశారు. కానీ ఇప్పటివరకు ఎవరూ కాశినాయన తహసీల్దారుగా విధుల్లో చేరలేదు. దీంతో వివిధ రకాల సర్టిఫికెట్‌లకోసం కార్యాలయానికి వచ్చే విద్యార్థులకు, మహిళలకు ఇబ్బందులు తప్పడంలేదు. మరోవైపు ఈబీసీ నేస్తం గడువు రేపటితో ముగినున్నందున మహిళలు ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయంచుట్టూ తిరిగిపోతున్నారు. ఈవిషయంపై డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నలక్ష్మీని వివరణకోరగా కొత్త తహసీల్దారు క్రిష్ణ 5 రోజుల ఎన్నికలకు ప్రత్యేక ట్రైనింగ్‌కోసం కడపలో ఆర్డర్ తీసుకొని అటే తిరుపతికి వెళ్లారన్నారు. పోరుమామిళ్ళ తహసీల్దారుకు ఇన్‌చార్జి వేశారని ఎవరైనా దరఖాస్తులు తీసుకవస్తే నేటి నుంచి పోరుమామిళ్ళకు తీసుకపోయి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు చేయిస్తామన్నారు.



పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించాం: ఆర్డీవో



జమ్మలమడుగు, ఫిబ్రవరి 13: జమ్మలమడుగు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించినట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఓటర్ల వివరాలు తెలిపారు. ఓటర్ల జాబితాలో ఏవైనా అభ్యంతరాలు అందితే ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని, ప్రస్తుతం తొలగింపులైతే జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ విజయరామరాజుకు జాబితాను పంపిస్తామని తొలగింపులు జరగాలన్నా అక్కడి నుంచి అనుమతి రావాల్సి ఉంటుందన్నారు. ఈ ఏడాది జనవరి 22వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గానికి (131) సంబంధించి 315 పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు సమాచారం అందించడమే కాక అనేకసార్లు ఆయా నాయకుల ప్రతినిధులకు సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ తుది జాబితాలో 1,17,067 మంది పురుష ఓటర్లు, 1,23,751 మంది మహిళల ఓటర్లు, 17 మంది థర్డ్ జండర్ ఓటర్లు కలిసి మొత్తం 2,40,835 మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. అలాగే నియోజకవర్గంలో 403 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారన్నారు. ఫైనల్ పబ్లికేషన్ 22.1.2024 ప్రచురణ ప్రకారం మొత్తం చేర్పులు 10,249 కాగా తొలగించిన ఓటర్లు 14,779గా నమోదయ్యాయన్నారు. తుది జాబితా ప్రకటించిన అనంతరం జమ్మలమడుగు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 3,087 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయన్నారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో ఫారంలో ఆన్‌లైన్ ద్వారా అందే ఫిర్యాదులపై చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ షఫి, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 13 : ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ మస్తాన్, ఎస్ఐ రాజేశ్వర్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, కేటాయించిన స్థలంలోనే ఆటోలను పెట్టుకోవాలన్నారు. డ్రైవర్లు లైసెన్స్‌లు,ఆటోలకు రికార్డు లేకుండా నడిపితే,పరిమితిని మించి ప్రయాణికులను ఎక్కించినా సీజ్ చేస్తామని హెచ్చరించారు.

